క్లుప్తంగా

బజరంగ్ ఫౌండేషన్ సేవలు ఆదర్శనీయం

ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య



కళ్లజోడు అందిస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య, పక్కన అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా బజరంగ్ ఫౌండేషన్ అధ్యక్షుడు అంబటి మురళీకృష్ణ పేద ప్రజలకు సేవ చేస్తున్నారని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య చెప్పారు. మండల పరిధిలోని వెల్లలూరు గ్రామంలో బజరంగ్ ఫౌండేషన్ అధ్యక్షుడు అంబటి మురళీకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం జగన్నామ సంవత్సరం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పాల్గొని మాట్లాడుతూ పేద ప్రజలకు అండగా నిలవాలనే ఆలోచనతో ముందుకు వచ్చిన బజరంగ్ ఫౌండేషన్ అధ్యక్షుడు అంబటి మురళీ కృష్ణ అభినందనీయులన్నారు. బజరంగ్ ఫౌండేషన్ అధ్యక్షుడు అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పొన్నూరు నియోజకవర్గంలో మొత్తం 20 గ్రామాలలో ఉచిత కంటి పరీక్షలు, అనంతరం కళ్లజోళ్ల పంపిణీ, విద్యార్థులకు పోటీ పరీక్షలు, వలంటీర్లకు పోటీ పరీక్షలు, స్త్రీలకు రుతుక్రమం పై అవగాహన కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. అనంతరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, ఎలిమెంట్రీ స్కూల్, అంగన్‌వాడీ స్కూల్‌లోని విద్యార్థులకు భోజన ప్లేట్లు, గ్లాసులు అందించారు. సర్పంచి ఇక్కుర్తి మల్లిఖార్జునరావు, బండి బాబు, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతలో రాజీవద్దు



పొన్నూరు: విద్యార్థులకు జగనన్న గోరుముద్ద భోజనాన్ని రుచికరంగా అందించాలని ఎంఈఓ రుద్రపాటి శోభాచంద్ పేర్కొన్నారు. పట్టణంలోని 5వ వార్డులోని మున్సిపల్ ఉన్నత పాఠశాలను, ప్రాథమిక పాఠశాలను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలనే ఆలోచనతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోట్ల రూపాయలు ఖర్చు చేసి జగనన్న గోరుముద్ద పథకాన్ని ప్రవేశ పెట్టారన్నారు. మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులు భోజన్నాని రుచికరంగా మెనూ ప్రకారం తయారు చేయాలన్నారు. అనంతరం నాడు–నేడు ఫేజ్ 2 పనులను పరిశీలించారు. పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి చేయాలి



కాకుమాను: విద్యారంగ అభివృద్ధికి, విద్యార్థుల అభ్యున్నతికి ఉపాధ్యాయులు, వివిధ ఉపాధ్యాయ సంఘాలు సమష్టిగా కృషి చేయాలని ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎస్టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు, ఎంపీడీఓ డి.శరత్ బాబులకు ఎస్టీయూ జిల్లా శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన డైరీలు, క్యాలెండర్‌లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎంపీపీ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యతోనే గ్రామాలు అభివృద్ధి సాధ్యమని అందుకోసం రాష్ట్ర ముఖ్యమంత్రి విద్యలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చినట్లు తెలిపారు.ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గేరా మోహనరావు, ఎస్టీయూ నాయకులు, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు ఉన్నారు.

'చలపతి'లో ముందస్తు సంక్రాంతి సంబరాలు



గుంటూరు రూరల్: సంక్రాంతి మన తెలుగువారి సంస్కృతి సాంప్రదాయాల పండుగని చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం నగర శివారుల్లోని లాం నందున్న కళాశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థినులకు రంగవల్లుల పోటీలను నిర్వహించారు. సాంప్రదాయ వస్త్రాల ప్రదర్శన నిర్వహించారు. వివిధ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.కిరణ్‌కుమార్, ప్రొఫెసర్ ఎ.రాధకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య
- కసుకర్రులో గడప గడపకు మన ప్రభుత్వం



వృద్ధురాలి సమస్యలు ఆలకిస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

పొన్నూరు: ప్రతి పేదవాడు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు పథకాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య చెప్పారు. మండల పరిధిలోని కసుకర్రు గ్రామంలో మంగళవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి నిర్వహించారు. గ్రామంలోని సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకుంటు, ప్రభుత్వం గత మూడు సంవత్సరాలుగా అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత మూడున్నరేళ్లుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన, రైతు భరోసా, ఆరోగ్యశ్రీ,, నాడు–నేడు, వైఎస్సార్ చేయూత, జగనన్న తోడు వంటి ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకు వచ్చి పేదలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు రూపొందించి అమలు చేస్తున్నారన్నారు. వృద్ధులకు, దివ్యాంగులకు, ఒంటరి మహిళలకు, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి పింఛన్లు ఇస్తున్నట్లు వివరించారు. గ్రామంలోని సమస్యలను పరిష్కరించేందుకు గడప గడపకు వెళుతున్నామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రతి కుంటుంబానికి వివిధ పథకాల రూపంలో అండగా నిలిచామన్నారు. సీఎం తీసుకువచ్చిన పథకాలతో ఆ కుటుంబానికి ఎంత మేరకు లబ్ధి చేకూరిందన్న విషయాన్ని తెలుపుతు రానున్న రోజులలో వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మారుతీ శేషమాంబ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, నాగిశెట్టి నరసింహారావు, కిలారి ప్రసాద్, యలవర్తి భరత్, గోపాళ్ళ అశోక్, మిక్కిలి సత్య, దాసరి నారాయణరావు, ఆకులు వెంకటేశ్వరరావు, దొప్పలపూడి వాసుదేవరావు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట

- నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు
- త్వరలో అమరావతి – బెల్లంకొండ డబుల్‌లైన్ రోడ్డుకు శంకుస్థాపన : ఎమ్మెల్యే శంకరరావు



రోడ్డు అనుమతి జీఓను చూపుతున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే శంకరరావు

గుంటూరు రూరల్: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. మంగళవారం నగరంలోని స్వర్ణభారతినగర్ సమీపంలోగల పెదకూరపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెదకూరపాడు నియోజకవర్గ వాసుల చిరకాల కోరికైన అమరావతి – బెల్లంకొండ డబుల్‌లైన్ రోడ్డు నిర్మాణానికి ముందడుగు పడటం సంతోషకరమన్నారు. నరసరావుపేట పార్లమెంట్ పరిధిలో సుమారు 250 కిలోమీటర్ల మేర నేషనల్ హైవేలు అభివృద్ధి చేస్తున్నామన్నారు.

ఎన్నికల హామీ నెరవేరబోతోంది..

ఎన్నికల ముందు అమరావతి – బెల్లంకొండ రోడ్డు నిర్మిస్తానని హామీ ఇచ్చానని.. ఈ హామీ నెరవేరే సమయం వచ్చిందని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరావు తెలిపారు. అమరావతి – బెల్లంకొండ డబుల్ లైన్ రోడ్డు నిర్మాణానికి రూ.149 కోట్లతో నిధులు మంజూరయ్యాయన్నారు. ఆ మేరకు జీఓ విడుదలైందని జీఓ ప్రతిని చూపించారు. త్వరలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పెదకూరపాడు నియోజకవర్గంలో పర్యటిస్తారని అమరావతి – బెల్లంకొండ డబుల్ లైన్ రోడ్డుకు శంకుస్థాపన, అదేవిధంగా అచ్చంపేట మండలం మాదిపాడు వద్ద కృష్ణానదిపై బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన, క్రోసూరులో పాలిటెక్నిక్ కాలేజీ భవన నిర్మాణాలను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని చెప్పారు. మాదిపాడు వద్ద కృష్ణానదిపై వంతెన నిర్మాణం వల్ల సుమారు 80 కిలో మీటర్లు దూరం కలిసి వస్తుందన్నారు. రూ.60 కోట్ల నాబార్డ్ నిధులు బ్రిడ్జి నిర్మాణానికి మంజూరైనట్లు తెలిపారు నియోజకవర్గంలో సుమారు 90 శాతం రోడ్లు పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఎంపీ, ఎమ్మెల్యేలను శాలువాలతో ఘనంగా సత్కరించారు.

వీవీఐటీ అధ్యాపకురాలికి డాక్టరేట్



పూజారి జీవనజ్యోతికి ఏఎన్‌యూ నుంచి వచ్చిన డాక్టరేట్‌ను అందజేస్తున్న చైర్మన్ విద్యాసాగర్

పెదకాకాని: వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలోని సైన్స్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన అధ్యాపకురాలు పూజారి జీవనజ్యోతి కంప్యూటర్ సైన్స్‌కు చెందిన భిన్నమైన అప్లికేషన్స్‌లో చేసిన పరిశోధనలకు గాను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా పొందినట్లు కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. పెదకాకాని మండలం నంబూరు వీవీఐటీలో మంగళవారం చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడారు. ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన డైనమిక్ వేరియంట్స్ టు ఎవల్యూషనరీ అప్టిమైజేషన్స్ మెథడ్స్ ఫర్ సీక్వెన్స్ ఎలైన్‌మెంట్ అను అంశంపై ప్రొఫెసర్ డాక్టర్ కె.కార్తీక పవన్ పర్యవేక్షణలో సమర్పించిన పరిశోధనా పత్రాలకు గాను డాక్టరేట్ పొందినట్లు తెలిపారు. కళాశాలలోని కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు కంప్యూటర్ అప్లికేషన్స్‌పై పూర్తి స్థాయి విజ్ఞానాన్ని అందించుటకు ఈ పరిశోధనలు ఉపయోగపడతాయని తెలిపారు. అనంతరం పూజారి జీవనజ్యోతిని చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, ప్రిన్సిపల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, డైరెక్టర్ డాక్టర్ వైవీఎస్ఎస్ఎస్‌వీ ప్రసాద్, సెక్రటరీ సూర్యదేవర బదరీ ప్రసాద్, కె.గిరిబాబు. డీన్ ఆఫ్ అడ్మిన్ డాక్టర్ ఎస్.కుమారస్వామి, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి వేదాంతం రామచంద్రన్, అధ్యాపకులు అభినందించారు.

శేకూరులో పశువుల చావిడి దగ్ధం

ఐదు గేదెలకు తీవ్ర గాయాలు



దగ్ధమైన పశువుల చావిడి

శేకూరుపాలెం(చేబ్రోలు): ప్రమాదవశాత్తూ జరిగిన అగ్ని ప్రమాదంలో పశువుల చావిడి, ఐదు పశువులకు తీవ్ర గాయాలైన సంఘటన చేబ్రోలు మండలం శేకూరుపాలెంలో మంగళవారం జరిగింది. శేకూరుపాలెం ప్రాంతానికి చెందిన రైతు గేరా శివ నాగయ్య, బసవమ్మ దంపతులు పశుపోషకులుగా జీవనం సాగిస్తున్నారు. గ్రామంలో నివసిస్తూ గ్రామ చివరలో పశువులకు చావిడి నిర్మించారు. దానిలో మూడు గేదెలు, రెండు దూడలు ఉన్నాయి. పశువుల పనులు ముగించుకొని ఇంటికి వచ్చి రాత్రి నిద్రించారు. అర్ధరాత్రి సమయంలో ప్రమాదవశాత్తూ పశువుల చావిడికి నిప్పు అంటుకొని పాక పూర్తిగా కాలిబూడిదైంది. అందులో ఉన్న మూడు గేదెలు, రెండు దూడలకు తీవ్ర గాయాలయ్యాయి. సుమారు రెండు లక్షల విలువ చేసే గేదెలు కాలిన తీవ్ర గాయాలతో అవస్థలు పడ్డాయి. సంచార పశు వైద్య వాహనానికి సమాచారం అందజేయటంతో రెండు వాహనాలు అక్కడకు చేరుకొని పశువులకు వైద్య సేవలు అందించాయి. నిరుపేద కుటుంబానికి చెందిన గేర శివ నాగయ్య అగ్ని ప్రమాదంతో నష్టపోయాడు. అగ్ని ప్రమాదం విషయం తెలుసుకున్న వెంటనే పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య బాధిత కుటుంబాన్ని మంగళవారం పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. ప్రమాదంలో తీవ్ర గాయాలైన పశువులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని పశువైద్యాధికారికి, సంచార పశు వైద్య సిబ్బందికి సూచించారు. నష్టపోయిన గేరా శివ నాగయ్య, బసవమ్మ దంపతులకు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య రూ.20వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. జీడీసీఎంఎస్ డైరక్టర్ కుర్రా పాములు, మాతంగి శ్యాంబాబు, నెమలికంటి వెంకయ్య, అనీల్, స్థానిక సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఇంటి పన్ను నూరుశాతం వసూలు చేయాలి

గుంటూరు జిల్లా పంచాయతీరాజ్ అధికారి కేశవరెడ్డి



మాట్లాడుతున్న డీపీఓ కేశవరెడ్డి

పొన్నూరు: ఇంటి పన్నులు నూరుశాతం వసూలు చేయాలని గుంటూరు జిల్లా పంచాయతీ అధికారి కేశవరెడ్డి పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో ఇంటి పన్ను, నీటి పన్నులు సకాలంలో వసూలు చేయాలన్నారు. ప్రజలు కూడా పన్నులు చెల్లించి గ్రామ అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. స్వచ్ఛ సంకల్పం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య ఎక్కడా రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉంటుందన్నారు. డీఎల్‌పీఓ శ్రీనివాసనాయక్, శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పుట్టలమ్మతల్లి ఆలయ కానుకల లెక్కింపు



అమ్మవారి ఆలయ హుండీ కానుకలు లెక్కిస్తున్న కమిటీ సభ్యులు

గుంటూరు రూరల్: మండలంలోని నల్లపాడు చల్లావారిపాలెం గ్రామాల గ్రామ దేవత పుట్టలమ్మతల్లి, గంటాలమ్మతల్లి ఆలయ హుండీ కానుకలను మంగళవారం లెక్కించారు. ఆలయ కమిటీ దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో జరిగిన లెక్కింపులో నేటివరకూ హుండీ ఆదాయం రూ.2,21,213లు వచ్చినట్లు దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, కార్యదర్శి సాయి విశ్వనాథ్, ఆలయ కమిటీ చైర్మన్ ఇంటూరి అంజిరెడ్డిలు తెలిపారు.

గొట్టిపాడులో అడిషనల్ ఎస్పీ పర్యటన

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు మండల పరిధిలోని పెదగొట్టిపాడులో మంగళవారం అడిషనల్ ఎస్పీ అనిల్ పర్యటించారు. కోర్టు ఆదేశాల మేరకు గొట్టిపాడు గ్రామానికి చెందిన కొంతమందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును గత ఏడాది డిసెంబరులో ప్రత్తిపాడు పోలీస్ స్టేషనులో రిజిస్టర్ చేశారు. ఈ నేపథ్యంలో విచారణాధికారిగా అడిషనల్ ఎస్పీ అనిల్ గ్రామంలో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

రైతును మోసగించిన ధాన్యం వ్యాపారి

చేబ్రోలు: రైతు వద్ద నుంచి ధాన్యం బస్తాలను కొనుగోలు చేసుకొని డబ్బులు ఇవ్వకుండా మోసం చేసిన వైనంపై పోలీసులు కేసు నమోదు చేసిన సంఘటన చేబ్రోలు మండలం మంచాల గ్రామంలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మంచాల గ్రామానికి చెందిన చిమటా సీతారామయ్య పాతపొన్నూరు ప్రాంతంలో నివసించే కొద్ది రోజుల క్రితం పరిచయం అయిన నెక్కంటి శ్రావణ్‌కుమార్‌కు రెండు వందల బస్తాల ధాన్యంను విక్రయించాడు. వీటితో పాటు వరి కోతకు ఉపయోగించే హార్వెస్టల నిమిత్తం కొంత డబ్బులను అందజేశారు. సుమారు రూ. నాలుగున్నర లక్షలు ఇవ్వాల్సి ఉంది. అయితే శ్రావణ్‌కుమార్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి, కనిపించకుండా కాలయాపన చేస్తుండటంతో రైతు సీతారామయ్య చేబ్రోలు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాదితుని ఫిర్యాదు మేరకు చేబ్రోలు ఎస్ఐ జి.వెంకటాద్రి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి ఇంటికీ వైద్య సేవలు

పొన్నూరు: ప్రతి ఇంటికి వైద్యసేవలు అందించటమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగుతోందని డాక్టర్ కె.శివ గోపాల్ పేర్కొన్నారు. మండల పరిధిలోని మునిపల్లె గ్రామంలో మంగళవారం ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ రోగులను వారి ఇంటి వద్దకే వెళ్లి పరీక్షించటం జరుగుతోందన్నారు. డాక్టర్ మహమ్మద్ హుసేన్, శ్యామ్, సూపర్‌వైజర్ ఎం.వేణు, మాలతీ, మహాలక్ష్మీ, సౌందర్య పాల్గొన్నారు.

సీఐటీయూ మహాసభలను విజయవంతం చేయండి

పెదనందిపాడు: ఈ నెల 18వ తేదీ నుంచి 22వ తేదీ వరకు బెంగళూరులో జరిగే సీఐటీయూ అఖిలభారత మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ మండల అధ్యక్షురాలు ఫణిదం భువనేశ్వరి అన్నారు. మంగళవారం పెదనందిపాడు పాతబస్టాండ్ సెంటర్‌లో సీఐటీయు జెండాను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికుల హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలని కేంద్రప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సీఐటీయు మండల ఉపాధ్యక్షులు దొప్పలపూడి రమేష్, పఠాన్ సలీమ్, చుక్కా యానాదులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యోగా తరగతులు

పెదనందిపాడు: యోగాతో వ్యాధినిరోధక శక్తిని పెంపొందించుకోవచ్చని ప్రముఖ యోగా నిపుణులు బాబారాందేశ్ శిష్యులు, కనపర్తి నాగమల్లేశ్వరరావు అన్నారు. మంగళవారం పెదనందిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాగులపాడు సుభిక్ష షోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కనపర్తి నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ బాల్యం నుంచే ఆహార నియమాలు పాటిస్తూ ప్రతినిత్యం యోగా ధ్యానం కూడా చేయాలని విద్యార్థులకు సూచించారు.

పుట్టలమ్మతల్లి ఆలయంలో సంక్రాంతి సంబరాలు

నాలుగు రోజులపాటు ఉత్సవాలు, రెండు రోజులు క్రీడా పోటీలకు సర్వం సిద్ధం



ఉత్సవాలకు ముస్తాబయిన పుట్టలమ్మతల్లి ఆలయం

గుంటూరు రూరల్: సంక్రాంతి సంబరాల్లో భాగంగా ప్రతిష్ఠాత్మకంగా ప్రతి ఏటా నల్లపాడు, చల్లావారిపాలెం గ్రామ ప్రజలు నిర్వహించే పుట్టలమ్మతల్లి ఘంటాలమ్మతల్లి ఆలయ సంక్రాంతి ఉత్సవాలు ఈనెల 11వ తేదీనుంచి కనుల పండుగగా నిర్వహించనున్నామని ఆలయ కమిటీ చైర్మన్ ఇంటూరి అంజిరెడ్డి మంగళవారం తెలిపారు. గ్రామంలోని ఆలయ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆరు రోజులపాటు నిర్వహించే ఈ సంక్రాంతి ఉత్సవాలలో భాగంగా ఈనెల 11, 12వ తేదీలు బుధ, గురువారాల్లో డబుల్స్ ఓపెన్ బ్యాడ్మింటన్ ఔట్‌డోర్ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నామన్నారు. 13వ తేదీన ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యేలు, మంత్రులు హాజరు కానున్నారన్నారు. అదేరోజు మధ్యాహ్నం మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీలలో పాల్గొనాలనుకునే మహిళలు ముందుగా తమ పేర్లను 9490642637, 7386242526, 9848454568 సెల్ నంబర్లలో నమోదు చేసుకోవాలన్నారు. 14వ తేదీన ఆలయంలో ఉదయం 5 గంటలనుంచి ప్రత్యే పూజలు హోమాలు వ్రతాలను నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు దెందుకూరి రాంబాబు తెలిపారు. 15వ తేదీన ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు అభిషేకాలు జరుగుతాయన్నారు. 16వ తేదీన ఉదయం పూజా కార్యక్రమాలు, పూర్ణాహుతి కార్యక్రమం జరుగుతుందన్నారు. రాత్రి 8 గంటలకు మెగా సినీ ఈవెంట్స్ ఆధ్వర్యంలో జబర్‌దస్త్ టీం ప్రత్యేక స్కిట్‌లు ఉంటాయన్నారు. సాయంత్రం అమ్మవారి ప్రసాద వితరణ కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో రెండు పూరిళ్లు దగ్ధం



బాధితులకు ఆర్థికసాయం అందజేస్తున్న తహసీల్దార్ ప్రసాదరావు

పాంద్రపాడు(కాకుమాను): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రెండు పూరిళ్లు పూర్తిగా దగ్ధమైన సంఘటన మండలంలోని పాంద్రపాడులో మంగళవారం చోటుచేసుకుంది. తహసీల్దార్ జె.ప్రసాదరావు తెలిపిన వివరాల మేరకు గ్రామంలోని ఎస్సీ కాలనీకు చెందిన కట్టా మరియమ్మ అనే మహిళ ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించడంతో మంటలు చెలరేగాయి. కాలనీ వాసులు, గ్రామస్తులు మంటలు అదుపుచేయాలని ప్రయత్నాలు చేసినప్పటికీ మంటలు అదుపుకాకపోగా, పక్కనే ఉన్న కట్టా శేషమ్మ అనే మహిళ ఇంటికీ మంటలు వ్యాపించాయి. దీంతో రెండు ఇళ్లల్లో మంటలు అధికం కావడంతో గ్రామస్తులెవరు మంటలను అదుపుచేయలేకపోయినట్లు ఆయన తెలిపారు. పొన్నూరు అగ్నిమాపక సిబ్బంది వచ్చే సమయానికి రెండు పూరిళ్లు పూర్తిగా అగ్నికి ఆహుతైపోయినట్లు తెలిపారు. రెండు పూరిళ్లపై సుమారు రూ.2 లక్షలకు పైబడి ఆస్తి నష్టం సంభవించి ఉంటుందని ఆయన తెలిపారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుంచి ఒక్కో కుటుంబానికి రూ.5వేల నగదు, 25 కేజీల బియ్యాన్ని తహసీల్దార్ ప్రసాదరావు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచి దేవిరెడ్డి సాంబయ్య, ఎస్ఐ డి.రవీంద్రబాబు, వీఆర్వో కాలీషా, సిబ్బంది ఉన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో కిట్స్ విద్యార్థుల ప్రతిభ



ఉద్యోగాలకు అర్హత సాధించిన విద్యార్థులతో కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికి ఉజ్వల భవిష్యత్తును అందించటం తమ కళాశాల లక్ష్యమని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు తెలిపారు. మంగళవారం వట్టిచెరుకూరు మండలం వింజనంపాడు గ్రామంలో గల కళాశాలలో సీజీఐ సంస్థ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో తమ కళాశాలకు చెందిన 47 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు ఏడాదికి రూ.4 లక్షల వార్షిక వేతనంతో సంస్థ ఒప్పందం చేసుకుందన్నారు. ఉద్యోగాలకు అర్హత సాధించిన విద్యార్థులను కళాశాల సెక్రటరీ కోయి శేఖర్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు, డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబు, ఉపాధి కల్పనాధికారి సీహెచ్ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు అభినందించారు.

ప్రాథమికస్థాయి నుంచే హిందీ నేర్చుకోవాలి



హిందీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులతో ఎంఈఓ కెనడీ, హెచ్‌ఎం అంకారావు, ఉపాధ్యాయులు

కొండపాటూరు(కాకుమాను): నేటి విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే హిందీపై ఆసక్తిని పెంచుకుని అందులో రాణించాలని ఎంఈఓ కేఎఫ్ కెనడీ అన్నారు. మండలంలోని కొండపాటూరు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం విశ్వ హిందీ దీవాస్ అనే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంఈఓ కెనడీ మాట్లాడుతూ బ్రిటీష్ పరిపాలనా కాలంలో భారతీయులందరినీ ఏకం చేసి స్వాతంత్ర్యం సాధించుకోవడానికి దోహదపడిన భాష హిందీ అని ఆయన తెలిపారు. దక్షిణ భారత హిందీ ప్రచార సభ ఆధ్వర్యంలో 4 నుంచి 8వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన హిందీ పరీక్షల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. హెచ్‌ఎం శీలం అంకారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'చేబ్రోలు ఇంజినీరింగ్'లో సంక్రాంతి సంబరాలు



రంగవల్లులు వేస్తున్న విద్యార్థినులు

చేబ్రోలు: పండుగలు సంస్కృతి, సంప్రదాయాలకు నిదర్శనమని చేబ్రోలు ఇంజినీరింగ్ కళాశాల వైస్ ప్రెసిడెంటు గొట్టిపాటి మస్తాన్ చౌదరి అన్నారు. చేబ్రోలులోని ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జ్యోతిని వెలిగించి సంబరాలను ప్రారంభించారు. మస్తాన్ చౌదరి మాట్లాడుతూ పంటలు ఇంటికి చేరి రైతులు ఆనందంగా ఉండే సంక్రాంతి పండుగ రోజుల్లో గ్రామీణ ప్రాంతాలు కళకళలాడుతుంటాయన్నారు. విద్యార్థులకు ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్స్, షాట్‌పుట్ తదితర ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. బొమ్మల కొలువు, పాటలు, నృత్యాలు, హరిదాసు వేషధారణలు ఆకట్టుకున్నాయి. భోగిమంటలు, గాలిపటాలను ఎగురవేశారు. డైరెక్టర్ మాలెపాటి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ డి.శ్రీధర్, పట్టాభి అంజిబాబు, దినేష్‌బాబు పాల్గొన్నారు.

14 నుంచి సంక్రాంతి సంబరాలు

ప్రత్తిపాడు: నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో బాపతు చెన్నారెడ్డి ధర్మ సత్రం ఆధ్వర్యంలో ఈ నెల 14, 15 తేదీల్లో సంక్రాంతి సంబరాలను నిర్వహించనున్నట్లు ధర్మసత్రం చైర్మన్ గంగిరెడ్డి సుబ్బారెడ్డి తెలిపారు. స్థానిక ధర్మసత్రంలో మంగళవారం రాత్రి ఈఓ జేవీ నారాయణతో కలిసి చైర్మన్ సుబ్బారెడ్డి విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ 14వ తేదీ మధ్యాహ్నం ప్రత్తిపాడులోని భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (హైస్కూల్)లో ముగ్గుల పోటీలు, ట్రాక్టర్ ట్రాలీ రివర్స్ పోటీలు, కబడ్డీ పోటీలు, పరుగుపందెం పోటీలు జరగనున్నాయన్నారు. ఈఓ నారాయణ మాట్లాడుతూ ఇక ప్రతి ఏటా ధర్మ సత్రం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను నిర్వహించేందుకు దేవదాయ ధర్మదాయశాఖ ఉన్నతాధికారులు అనుమతి ఇచ్చారని చెప్పారు. మొదటిగా ఈ ఏడాది నిర్వహిస్తున్న పోటీలకు ప్రజలు సహకరించాలన్నారు. పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు సత్రంలో తమ పేర్లను నమోదు చేయించుకోవాలని చెప్పారు. విజేతలకు 15వ తేదీన సత్రం నందు జరిపే ముగింపు వేడుకల్లో బహుతులు అందిస్తామని చెప్పారు.